# నేను

నాకు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారు వ్రాసిన పాటలంటే మహా ఇష్టం. ఆయన పాటల్లో సముద్రాల మల్లాదిల సముద్రమంత ఆలోచన, దేవులపల్లి ఆత్రేయల మల్లె మనసుల భావుకత, శ్రీశ్రీ పద గాంభీర్యం, ఆరుద్ర సినారె పింగళిల లలిత పద సౌందర్యం, కొసరాజు అల్లరి అన్నీ కనిపిస్తాయి నాకు. బూతూరి బాదుళ్ళ పాటలతో పాతాళలోకానికి పోయిన మన తెలుగు సినిమా సాహిత్యం, సంగీతం, కాస్త ఇంకా నిలబడి వుందంటే ఇలాటి ఒకరిద్దరు రచయితలే.

సిరివెన్నెల పాట ఒకటి వుంది 'నువ్వంటే నాకిష్టం' అని. ఆ పాటలో ఒక చరణంలో 'నేనంటే నాకిష్టం, నాకన్నా నువ్విష్టం' అని వ్రాశారాయన. ఆ పదమంటే నాకిష్టం. నాకైనా మీకైనా ఎవరికైనా తామంటే తమకి ఇష్టమే. ఇంకా లోతుగా వెడితే బాగా ఇష్టం కూడాను. అలాటిది వాకన్నా కూడా నువ్వంటేనే ఇష్టం అంటే భోలెడు ఇష్టం అన్నమాట. ఈసారి మన కబుర్లు ఆ 'నేను' గురించే!

0 0 0

నా ఉద్దేశ్యంలో ఈ 'నేను'లు రెండు రకాలు. ఒకటి నిజంగా నేనెవరో తెలుసుకుందామని ప్రయత్నం చేయటం. ఇది చాల చోట్ల చూస్తున్న నిజం. రెండో నేను ఆత్మస్తుతితో గర్వంగా స్తుతించే నేను. ఇది మంచిది కాకపోవటమొకటే కాదు. చాల ప్రగతిహీనం కూడాను. మనమిక్కడ ఈ రెండో దాని గురించి కొంచెం చెప్పుకున్నా ఈ కబుర్ల ఉద్దేశ్యం మాత్రం మొదటి దాని గురించే.

పైన చెప్పిన 'సెల్ఫిష్ నేను' మనలో ఎక్కువే. దురభిమానాల పుట్టలం కనుక. కులం మతం ప్రాంతం భాష యధాశక్తి వాడుకుంటూ ఆ నేను ముందర, గీతలు గీసుకోవటం మన జన్మహక్కు. అనుమానంవుంటే మన సినిమా లోకం, రాజకీయాల్లో తెలుగుదేశం కాంగ్రెస్ బిజెపి, అమెరికాలో ఆటా తానాలన్నీ మనకి మరిచిపోకుండా మనమెవరో గుర్తుచేస్తుంటాయి. ఆంధ్రప్రదేశంలో వున్నప్పుడు కులాభిమానాలు చూస్తుంటాం. త్రివేండ్రం వెళ్ళాక భాషాభిమానాలూ, ప్రాంతీయాభిమానాలూ చూశాను. అమెరికా వచ్చాక మనవాళ్ళల్లో ఇవన్నీ మళ్ళీ చూస్తూనే వున్నాం.

ఇవన్నీ ఆలోచిస్తుంటే ఏనాడో చూసిన ఆదుర్తి-అక్కినేనిల 'సుడిగుండాలు' సినిమా గుర్తుకొస్తుంది. మనుష్యులందరూ దేవుని పిల్లలే కులాలూ మతాలూ వుండ కూడదన్న మహాత్మా గాంధీ గురించి చెప్పే పాఠ్య పుస్తకంలో మొదటి వాక్యం, 'మోహన్‌లాల్ కరంచంద్ గాంధీ పోర్బందర్‌లో వైశ్య కుటుంబములో జన్మించెను' అని. ఆ మహాత్ముడికి అదీ మన నివాళి!

మనం ఈ 'నేను' గురించి ఇక్కడ వద్దనుకున్నాం కనుక, ఇంకో 'నేను' గురించి చూద్దాం.

అలెక్స్ హేలీ అనే ఒక గొప్ప రచయిత కొన్ని దశాబ్దాల క్రితం 'రూట్స్' అని ఒక పుస్తకం వ్రాశాడు. దాన్ని తర్వాత టీవీ సీరియల్‌గా సినిమాగా కూడా

తీశారు. అందులో కింటాకుంటే అనే నల్ల అమెరికన్ ఆఫ్రికాలో తన వంశవృక్షాన్ని వెతుక్కుంటూ వెళ్ళి, తన 'నేను' వెనకాల ఎంత చరిత్రవుందో చూడటం కథ. చాల గొప్ప చిత్రణ. ఆ పుస్తకం ఉత్తమ సాహిత్యంలో ఒక మణిహారం. అందరూ తప్పక చదవవలసిన పుస్తకం. ఆ పుస్తకాన్నీ సినిమానీ ఎన్నోసార్లు చదవటం, చూడటం వల్ల ఆ కథ అలా నా మనసులో హత్తుకుపోయింది.

తర్వాత కొన్నాళ్ళకి బాపు వంశవృక్షం సినిమా చూశాను. అంతకుముందు గోపీచంద్, పండిత పరమేశ్వరశాస్త్రిగారి వీలునామా చదివాను. ఈ రెండిటిలోనూ తను నమ్మిన వంశవృక్షాన్ని కాపాడుకోవటంలో వున్న తపన, దాని పూర్వాపరాలు తెలుసుకోవటంలో వుండదు. తెలుసుకున్నాక పడే వేదన బాగా చిత్రింపబడుతుంది.

నాకు తెలిసిన అమెరికన్ మిత్రుడు 'బిల్' ఒకరోజు లంచ్‌కి వెళ్ళినప్పుడు తన కథ చెప్పాడు. అతని ఇంటి పేరు ఒక జర్మన్ పేరు. నాలుగు తరాల క్రితమే అతని ముత్తాతలు అమెరికా వచ్చేశారు. అతని తండ్రీ చిన్నప్పుడే పోవటంవల్ల, అతనికి జర్మనీలో తనవాళ్ళతో సంబంధం పూర్తిగా తెగిపోయింది. రెండు మూడేళ్ళ నించీ అతనిలో తన పూర్వీకుల గురించి తెలుసుకోవాలనే కుతూహలం, పట్టుదలగా మారింది. ఉత్తరాలు వ్రాయటంతో ప్రారంభించి, ఇంటర్నెట్లో గాలించి, మొత్తానికి ఒక కొనని పట్టుకున్నాడు. అందుకే ఆ ఆనందంలో నన్ను లంచ్‌కి తీసుకువెళ్ళి తనే ఇద్దరికీ బిల్లు పే చేశాడు.

'ఇక ఈకొస పట్టుకుని తాడు లాగటమే' సంతోషంగా చెప్పాడు. తర్వాత మేమిద్దరం లండన్‌కి ఆఫీసు పనిమీద వెళ్ళినప్పుడు, నేను వెనక్కి వచ్చేస్తే అతను జర్మనీలో ఫ్రాంక్‌ఫర్ట్‌కి వెళ్ళాడు. అక్కడినించీ వచ్చాక జర్మనీలో ఎవరెవరిని కలిశాడో వాళ్ళ చుట్టరికాలేమిటో చెప్పుకొచ్చాడు. ఇంకా తన పని పూర్తిగా అవలేదనీ, కానీ దగ్గరగా వస్తున్నాననీ చెప్పాడు.

ఆ మధ్య ఒక స్నేహితుడు ఈ ఔట్‌సోర్సింగ్‌ల వల్ల అమెరికానించీ బెంగుళూర్ వెళ్ళాడు రెండు మూడు సార్లు.

'మీకొక తమాషా విషయం చెప్పాలి. ఇక్కడ ఆఫీసులో మనం అమెరికన్లతో సమానంగా పనిచేస్తున్నా మనల్ని ఇండియన్లుగా చూస్తారుకదా. దురభిమానంతో కాకపోయినా, ఆ భావనలో తేడా వుంది. గమ్మత్తేమిటంటే బెంగుళూర్ వెళ్ళినప్పుడు నన్నో అమెరికన్‌లాగా చూస్తారు వాళ్ళు. వాళ్ళల్లో ఒకడ్నిగా చూడలేదు. ఎందుకని?'

అవును. ఎందుకని? పాతుకుపోయిన నా వేళ్ళు ఇండియాలో వున్నాయి. మరి కొత్తగా ఇంకో దేశంలో చిగురిస్తున్న మొక్కలకి వేళ్ళెక్కడ వున్నాయి?

అమెరికాలో రెండవతరం పిల్లల్లో చాలమందిని కలిసినప్పుడు, 'ఏమ్మా! ఇండియాలో మీదే వూరు?' అని అడిగితే జవాబు ఏం చెబుతారో తెలుసా?

'మా అమ్మది వైజాగ్. మా నాన్నది కాకినాడ. మాది అట్లాంటా' అంటుంది అట్లాంటాలో పుట్టి పెరుగుతున్న ఇండియన్ అమెరికన్ అమ్మాయి.

ఇండియానించి చుట్టంచూపుగా వచ్చిన పూలమ్మ 'అమెరికా వచ్చి మనం ఎక్కడనించీ వచ్చాము, మన భాష ఏమిటి, మన సంప్రదాయం ఏమిటి అన్నది

మరిచిపోతే ఇంతే మరి! పిదప కాలం. పిదప బుద్ధులు' అంది.

అందరూ అలాగే వుంటారని కాదు. అలా ఆలోచించని వాళ్ళల్లో సునీల్ ఒకడు. అమెరికాలో పుట్టి పెరిగిన పదిహేడేళ్ళ కుర్రాడు. విజయవాడ సుబ్బారావు గారబ్బాయి కనుక అమ్మానాన్న దగ్గర తెలుగు నేర్చుకున్నాడు. నాలాటివాళ్ళతో తెలుగులోనే మాట్లాడతాడు. అమెరికాలో పుట్టి పెరిగాడంటే నమ్మలేం. ప్రీ మెడికల్ కోర్సుకి వెళ్ళే లోపల ఒకసారి ఇండియాకి వెళ్ళివద్దామని రెండు వారాల ప్రయాణం కట్టాడు. అతను తిరిగి వచ్చాక మాకు చెప్పిందిది.

హైదరాబాద్‌లో తన అత్తయ్యగారింటికి వెళ్ళాడు. అక్కడ ఒక రోజు సరదాగా గడిపి, మర్నాడు సాయంత్రం సికింద్రాబాద్‌లో పిన్నిగారింటికి వెళ్ళటానికి బయల్దేరాడు. సునీల్ అంతకుముందు రెండుసార్లు వాళ్ళింటికి వెళ్ళాడు కనుక, ఈసారి తనంతట తనే వెడతానన్నాడు. కాకపోతే అతనికా సందులూగొందులూ ఆటో డ్రైవరుకి చెప్పటం అక్కడికి వెడితేకానీ చెప్పలేడు. అపార్ట్‌మెంట్లోనించీ రోడ్డుమీదకి వచ్చాడు. అమెరికాలో ఆటోలుండవు కనుక అతనికి ఆటో చూడగానే ఉత్సాహం వచ్చింది. 'వస్తావా' అని అడిగాడు చక్కటి తెలుగులో. అతను హిందీలో ఏదో చెబుతున్నాడు. సునీల్‌కి ఒక్క మాటా అర్థం కాలేదు. 'నీకు తెలుగు వచ్చా?' అని అడిగాడు. ఆటో అతనికి కోపం వచ్చినట్టుంది. ఏదో తిడుతున్నాడు. అర్థంకాకపోవటం మంచిదే అనుకున్నాడు సునీల్. అతనికి వెళ్ళమని చేత్తో సంజ్ఞ చేసి, ఇంకో ఆటో కోసం ఎదురు చూస్తున్నాడు. ఆ ఆటో అతను మాత్రం ఎక్కడికీ పోకుండా పక్కనే నుంచుని, ఇంకా ఏదో అంటూనే వున్నాడు. రెండో ఆటో వచ్చింది. అతనుకూడా ఉర్దూలో ఏదో అన్నాడు. సునీల్‌కి ఒక్క ముక్కా అర్థంకాలేదు. అతన్ని అడిగాడు 'తెలుగు రాదా?' అని. అతనికి కూడా బాగా కోపం వచ్చినట్టుంది, పెద్దగా తిడుతున్నాడు. సునీల్ కొంచెం పక్కకి వెళ్ళి అక్కడో ఆటో వుంటే అతని వేపు చూశాడు. అతను 'ఎక్కడికి పోవాలి సార్' అని అడిగాడు తెలుగులో. సునీల్ ఆ ఆటో ఎక్కి పిన్నిగారింటికి బయల్దేరాడు.

'అదికాదంకుల్. మన రాజధానిలోనే ఎక్కువమంది తెలుగు మాట్లాడరు. ఇక్కడ అమ్మా నాన్నా మన భాష, సంస్కృతి మర్చిపోవద్దని రోజూ మాచేత తెలుగు మాట్లాడిస్తారు. అక్కడ ఆటోవాళ్ళూ, షాపులవాళ్ళే కాదు, మన చుట్టాల పిల్లలే ఇంగ్లీషు తప్ప తెలుగు మాట్లాడరు. నేను తెలుగులో మాట్లాడితే, యు స్పీక్ టెలుగూ అని ఆశ్చర్యపోయారు. మరి అదేమిటి?' అని సూటిగా అడిగాడు.

'నేను' గురించి సునీల్ ఆలోచిస్తున్నాడని అర్థమవుతూనే వుంది.

0 0 0

ఏనాడో బాపుగారు ఒక కార్టూన్ వేశారు. ఆ కార్టూన్ ఇలా సాగుతుంది.

కృష్ణుడు తలుపు తడతాడు. ఎవరు అంటుంది సత్యభామ. నేనే అంటాడు కృష్ణుడు. 'నేనే అంటే?' అడుగుతుంది సత్యభామ. 'అది తెలుసుకుందామనే కదా నా ప్రయత్నం!' అంటాడు శ్రీకృష్ణుడు.

ఆ 'నేను' అనేది తెలుసుకోవటమే మన భగవద్గీతా సారం! గీతా భాష్యం!

0 0 0